క్లుప్తంగా

మా స్థలాన్ని మాకు కేటాయించండి



శాంతినగర్ : దళితులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని మండల తహసీల్దార్ జయరాములుకు తనగల గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 409లో రెండు గుంటల స్థలం శ్మశాన వాటికకు ఉండేదని, కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు. సర్వే చేయించాలని కోరారు.

మొక్కల పెంపకంపై దృష్టి

మల్దకల్: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై నిర్వాహకులు దృష్టి సారించాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు. శనివారం మండలంలోని గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు, నర్సరీ నిర్వాహకులు ఉన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో 23వ తేదీన ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి రాఘవ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

కరపత్రాలు విడుదల

గద్వాల అర్బన్: యూత్ డిక్లరేషన్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న నిర్వహించబోయే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీలోగా 7661899899నంబర్‌కు మిస్డ్‌కాల్ చేసి లింకులో వివరాలను పొందుపర్చాలన్నారు. ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇసాక్, రఘు, రాజేంద్ర, శ్రీకాంత్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడు, కవికి సన్మానం



మల్దకల్: మండలంలోని తాటికుంట జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు పాల్వాయి లక్ష్మీనారాయణను శనివారం హైదరాబాద్ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ ప్రతిష్టన్ ఆధ్వర్యంలో గాంధీ సంస్థల ౘైర్మన్ గున్నా రాజేంద్రరెడ్డి చేతుల మీదుగా సన్మానం నిర్వహించారు. కవి విభాగంలో అవనిశ్రీ వీరేష్‌ను ఉత్తమ కవిగా సన్మానించి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కేటీదొడ్డి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్ అన్నారు. మండలంలోని నందిన్నెలో శనివారం పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న పనులపై తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తాచెదారం వేయకూడదన్నారు. ఎక్కడైనా కాల్వలలో మురికి పేరుకుంటే వెంటనే తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లను అపరిశుభ్రం చేస్తే వారికి జరిమానా విధించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కేటీదొడ్డి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని సర్జాపురానికి చెందిన వడ్డె మల్లేష్, బోయ వెంకటయ్య, అయ్యప్ప వారి గ్రామం నుంచి పాతపాలెం వైపు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తెల్లవారుజామున పాతపాలెం శివారులో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

- ప్రత్యేక డ్రైవ్‌తో గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు
- ముమ్మరంగా సాగుతున్న పనులు



గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



రాజోళిలో డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న కార్మికులు

రాజోళి: పరిశుభ్రమైన గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా అధికారులు, పంచాయతీలు ముందుకు కదిలాయి. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంతో ఏడు రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని పంచాయతీల్లో చేపడుతున్న పనుల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో రూపురేఖలు మారుతున్నాయి. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలతో పాటు, పేరుకుపోయిన పలు సమస్యలను పరిష్కరిస్తున్నారు. దీని కోసం ఆయా పంచాయతీల వారీగా సర్పంచులు, సిబ్బంది పనులను వేగంగా చేస్తున్నారు. ఈనెల 17వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం 23 వరకు చేపట్టనున్నారు.

డ్రెయినేజీ నుంచి శ్మశానవాటిక వరకు..

గ్రామంలో డ్రెయినేజీలు మొదలుకుని శ్మశానవాటికలో ఉన్న పలు సమస్యల వరకు అన్నింటి పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చడం, కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తీసేయడం, శ్మశాన వాటిక వద్ద పెరిగిన కంప చెట్లను తొలగించడం, రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు కలగకుండా రోడ్లను బాగు చేయడం, ఇంకుడు గుంతల ప్రాధాన్యత వివరిస్తూ, గుంతలు తీసుకుని వారికి కొత్తగా ఇంకుడు గుంతలు తీయించడం, పాత మిద్దెలు, కూలిన ఇళ్లను తొలగించే పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధానంగా నీటి ట్యాంకులు, కొళాయిల వద్ద పేరుకుపోయిన మురుగును, గడ్డిని తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఇలాంటి పనులు గ్రామాల్లో నిరంతరం చేస్తున్నప్పటికీ, కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు వీలు కాకపోవడంతో నిలిచిపోతున్నాయని, వాటిని కూడా ప్రత్యేక డ్రైవ్‌లో పరిష్కరిస్తున్నామని సర్పంచులు తెలుపుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కూలేందుకు సిద్ధంగా మిద్దెలు, ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, వాటి ద్వారా ఇబ్బందులు రాకుండా కూలగొట్టడమే కాకుండా, పాడుబడిన బావులను పూడ్చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన నర్సరీలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

సమస్యల పరిష్కారం



గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయి. కొన్ని పనులు ప్రతి నెలా చేస్తున్నప్పటికీ, పాత బావులు పూడ్చడం, పాత మిద్దెల నుంచి ప్రమాదాలు రాకుండా నివారణ చర్యలు చేపడుతున్నాం. ఏళ్ల తరబడి కొన్ని ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల వద్ద పేరుకుపోయిన కాల్వలు, రోడ్లు, మురుగు సమస్యలు తీరుతున్నాయి. ప్రత్యేకంగా తాగునీటి కొళాయిల వద్ద మొదలుకుని గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లడం వల్ల ప్రజలు కూడా వీధులను శుభ్రంగా ఉంచుకుంటున్నారు. – తిరుమల్‌రెడ్డి, సర్పంచ్, పచ్చర్ల

ముమ్మరంగా పనులు..



ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ద్వారా చేస్తున్న పనులు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. నర్సరీలు, ముళ్ల చెట్ల తొలగింపు, శ్మశాన వాటికకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరిస్తున్నాం. ప్రజల కూడా సహకరిస్తున్నారు. – గోవిందరావు, ఎంపీడీఓ, రాజోళి

శాకాహారంతో ఆరోగ్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: మనుషులు శాకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో 'శాకాహారమే మానవహారం' పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు దానికి సంబంధించిన పుస్తకాలు చదవాలన్నారు.

ఘనంగా జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



బాలసదన్‌లో స్పోర్ట్స్ మెటీరియల్ అందజేస్తున్న అభిమానులు

గద్వాలన్యూటౌన్: సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్వయంభూ బండబావి ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్టీఆర్ పేరిట పూజలు చేశారు. నవరంగ్ థియేటర్ వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం బాలసదన్‌లో బాలబాలికలకు నిత్యావసర వస్తువులు, స్పోర్ట్స్ మెటీరియల్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో చిరుముదిరాజ్, సుభాన్, వీరేష్, నవీన్, సమీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అభిమానులు వెంకటేష్ నాయుడు, అలీంఖాన్, మైబు ఆధ్వర్యంలోని బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యునస్, వీరారెడ్డి, గోపాల్ కృష్ణ, రసూల్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామయ్య చిత్రపటానికి పాలాభిషేకం



దరూరులో పాలాభిషేకం చేస్తున్న కురువ సంఘం నాయకులు



జిల్లా కేంద్రంలో..

గద్వాల: కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని కురువ సంఘం ప్రతినిధులు, నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలలో పటాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పాతబస్టాండ్ చౌరస్తాలో సిద్ధరామయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కురువ సామాజిక వర్గానికి చెందిన సిద్ధరామయ్య కర్ణాటకకు రెండోసారి ముఖ్యమంత్రి కావడం గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణలో రాబోవు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని పార్టీలు కురువ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు తగిన అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రాములు, కేశవులు, రాధాకృష్ణ, గోవర్ధన్, ఈశ్వర్, రాఘవేంద్ర, వీరన్న, మద్దిలేటి, దౌలు, లవన్న, బలరామ్, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కురువ సంఘం నాయకుడు కిష్టన్న ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో సిద్ధరామయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. భారీ ఎత్తున పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వెంకటేష్, తాయన్న, కృష్ణ, శ్రీనివాసులు, మల్దకల్, దరెప్ప, జయపాల్, సత్యన్న, నర్సింహులు, పెద్ద నర్సింహులు, సవారప్ప, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



గద్వాలలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్ తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

గద్వాల వ్యవసాయం: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం హెచ్చరించింది. విత్తన ప్రాసెసింగ్ యూనిట్, విత్తన డీలర్ల దుకాణాల తనిఖీల్లో భాగంగా.. శనివారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ సచిన్‌దత్, అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ ఇతర అధికారులతో కలిసి మండలంలోని కావేరీ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను చూశారు. విత్తన నిల్వలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలనే ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, ప్రాసెసింగ్ చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీడ్ కంపెనీలో తనిఖీ

ఎర్రవల్లిచౌరస్తా: నకిలీ విత్తనాలు తయారు చేసే కంపెనీలపై చర్యలు తప్పవని స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏడీఏ సచిన్ దల్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని వేముల సమీపంలో గల ఇమేజ్ క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీడ్ కంపెనీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంపెనీలోని స్టాక్ వివరాలతో పాటు పరిమాణం, పత్తి, ఆముదం విత్తన ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. లాట్ నెంబర్ కేఈ 11067 పత్తి విత్తనాలకు హెచ్‌టీ కాటన్ పరీశీలించగా హెచ్‌టీ నెగెటివ్ వచ్చినట్లు తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని విత్తనాలను భద్రపరిచే గోదాములు వీకేర్ సీడ్స్, షన్ముఖ సీడ్స్, శ్రీనివాస సీడ్స్‌ను ఏడీఏ సక్రియానాయక్, టాస్క్‌ఫోర్స్ం టీం తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా మొక్కజొన్న, వరి విత్తనాలకు సంబంధించి రిజిస్టర్‌లో నమోదు లేనందున వాటిని అమ్మకానికి నిలిపివేసినట్లు తెలిపారు.

మానవపాడు:మండలంలోని జల్లాపురంలో శనివారం విజిలెన్స్ టీం పర్యటించారు. అంకూర్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విత్తనాల ప్రాసెస్‌ను, నిల్వలను పరిశీలించారు.

గౌడ కుల సంక్షేమానికి కృషి



నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్

శాంతినగర్: గీతా కార్మికులు, గౌడ కులస్తుల సంక్షేమం కోసం కృషిచేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ అన్నారు. పట్టణంలో గౌడ కులస్తుల మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గీత కార్మికుడు ఆర్థికంగా ఎదగాలని, వారి కుటుంబాలు అన్ని విధాలా అభ్యున్నతి చెందాలన్నారు. కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం తరపున అందాల్సిన వివిధ పథకాలను వర్తింపజేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. అందరూ ఏకతాటిపై నిలిచి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం వడ్డేపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. మండల అధ్యక్షుడిగా రాధాకృష్ణగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడిగా అర్జున్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పరమేష్‌గౌడ్, కోశాధికారిగా రాజశేఖర్‌గౌడ్, సలహాదారులుగా గోవర్ధన్‌గౌడ్, రామాంజనేయులుగౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'బీసీలకు ఎన్ని సీట్లిస్తారో చెప్పాలి'



అయిజ: బీసీలకు ఎన్ని సీట్లు కేటాయిస్తారో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 60 నుంచి 70 మంది బీసీలను అసెంబ్లీకి పంపేదాక నిద్రపోనని చెప్తారన్నారు. ప్రభుత్వం ద్వారా బీసీలకు కావాల్సింది రూ.లక్ష కాదని, వారిని చట్టసభల్లోకి పంపించే ధైర్యం బీఆర్ఎస్‌కు ఉందా అని ప్రశ్నించారు. నేటికి బీఆర్ఎస్ నాయకులు బీసీలకు ఎన్ని ఎమ్మెల్యే, పార్లమెంట్ సీట్లు కేటాయిస్తారో చెప్పడం లేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ఏ సామాజిక వర్గం జనాభా ఎంతో వారి వాటా అంతా అనే నినాదంతో బీఎస్పీ ఉందన్నారు. కార్యక్రమంలో రాజు, బీసన్న, రాంబాబు, రామకృష్ణ, శేఖర్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

కుప్పకూలి అక్కడికక్కడే మృతి

గద్వాల క్రైం: పట్టణానికి చెందిన రామాచారి (40) మేళచెరువు రోడ్డు సమీపంలో కార్పెంటర్‌గా యజమాని నర్సింహ వద్ద పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం దుకాణంలో పని చేస్తూ అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాయిప్రకాష్

అయిజ: ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా చేపట్టిన పనులను పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని సంకాపురంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణలో భాగంగా వైకుంఠధామం, పల్లె ప్రకృతివనంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ పనులను పరిశీలించారు. ఈనెల 23 వరకు చేపట్టనున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని అన్ని రోడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి వీరేష్‌ను ఆదేశించారు.

మండలం ఏర్పాటు చేసే వరకు పోరాడుదాం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: మేడికొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంత వరకు పోరాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గ్రామస్తులు చేపట్టిన నిరాహారదీక్ష శనివారం 6వ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరం చేరుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. పోరాటానికి పార్టీ తరుపున పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని, అవసరమైతే జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు. మేడికొండను మండలంగా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు.

రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు రాణించాలి



గట్టులో బహుమతులు అందుకున్న క్రీడాకారులతో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

గట్టు: సీఎం కప్ క్రీడా పోటీల్లో మండలానికి చెందిన క్రీడా కారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొని రాణించాలని ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల కోరారు. శనివారం సీఎం కప్ విజేతలకు మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. ప్రతిభ కనబర్చిన జట్లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కబడ్డీలో గట్టు టీం మొదటి బహుమతి, ఆలూరు టీం ద్వితీయ బహుమతులను దక్కించుకున్నాయి. వాలీబాల్‌లో గొర్లఖాన్‌దొడ్డి మొదటి బహుమతి, తప్పెట్లమొర్సు ద్వితీయ బహుమతులను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ మహేష్, పీఈటీలు నర్సింహులు, రాములమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని ఉన్న ప్రధాన దేవాలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సద్దలోని పల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయ స్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, అమరవాయి వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీవెంకటేశ్వర స్వామి వారికి కర్ణాటక రాష్ట్రంలోని మటుమారి చెందిన సుబ్బారావు, గాయత్రి దంపతులు 250 గ్రాముల వెండి పాదాలను స్వామి వారికి బహూకరించారు.

క్రైమ్ రేటు తగ్గించాలి: డీఎస్పీ



సిబ్బందితో క్రైమ్ వివరాలపై చర్చిస్తున్న డీఎస్పీ

ఎర్రవల్లిచౌరస్తా: పోలీస్‌స్టేషన్‌లలో క్రైమ్ రేటును తగ్గించాలని డీఎస్పీ రంగస్వామి సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం కోదండాపురం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే వారికి న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కోర్టు పరిధిలోని సివిల్ కేసులలో పోలీస్ వారు జోక్యం చేసుకోరాదని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లు అంటే ప్రజలకు రక్షణ నిలయాలుగా ఉండాలన్నారు. పెట్రోలింగ్ సిబ్బంది పాత నేరస్తులపై రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమాలకు పాల్పడే వారికి శిక్ష పడేలా చూడాలన్నారు. సిబ్బందికి ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట సీఐ సూర్యానాయక్, ఎస్ఐ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు



బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న జెడ్పీ ౘైర్‌పర్సన్ సరిత

గద్వాల క్రైం: పట్టణంలోని దౌదర్‌పల్లి కాలనీకి చెందిన జములమ్మ, అర్జున్, వైశాలీ శనివారం తెల్లవారుజామున ఆటోలో ధరూర్ వెళ్తుండగా పారుచర్ల సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను బొలెరా గూడ్స్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ ౘైర్‌పర్సన్ సరిత, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ తదితరులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

బొలెరో వాహనం డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రశేఖర్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి శాంతిపజేశారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని త్వరలో అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

కుటుంబానికి అండగా ఉంటాం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంఘటన చాలా బాధాకరమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.



ప్రమాదకారణాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డీకే అరుణ